శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

డిఎస్‌పి స్వామిరెడ్డి

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి

భీమవరం రూరల్ :ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని భీమవరం డిఎస్‌పి వి.నారాయణస్వామిరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్నికలు-ఓటు విలువ, శాంతి భద్రతలు-ప్రజల బాధ్యత అనే అంశాలపై బ్రోచర్లను డిఎస్‌పి మంగళవారం ఆవిష్కరించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసు లకు ప్రతి ఓటరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు సహకరిస్తే ఎన్నికలు సజావుగా సాగుతాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ రెడీ'..!

- 14 అసెంబ్లీ స్థానాలకుగాను 12 చోట్ల అభ్యర్థుల ప్రకటన
- పలు నియోజకవర్గాల్లో బరిలోకి బలమైన అభ్యర్థులు
- ప్రధాన పార్టీల గెలుపోటములను తారుమారు చేయనున్నట్లు చర్చ
- నరసాపురంలో ప్రధాన పార్టీలకు భిన్నంగా కాపు సామాజిక తరగతికి టిక్కెట్
- ఎంపీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఇంకా వీడని సస్పెన్స్
- బిజెపిపై కోపంతో ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఓట్లు ఎక్కువగా పడే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర విభజన తర్వాత కొత్త ఊపుతో కాంగ్రెస్ ఈసారి సాధారణ ఎన్నికల బరిలోకి దిగుతోంది. ప్రధాన పార్టీలకు ధీటుగా నిలబడే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్ అధిష్టానం మంగళవారం అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా 12 చోట్ల అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఏలూరు, ఆచంట నియోజకవర్గాలకు సంబంధించి ఇంకా పెండింగ్ ఉంది. ఇండియా వేదికలో భాగంగా ఏలూరు నుంచి సిపిఐ పోటీ చేయనున్నట్లు తెలియగా, ఆచంటలో పోటీలో ఉండే అభ్యర్థిపై స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ప్రధాన పార్టీల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థుల్లో ఎవరికి నష్టం జరుగుతుందనే లెక్కలు కడుతున్న పరిస్థితి నెలకొంది. చింతలపూడి వైసిపి ఎంఎల్‌ఎగా ఉన్న ఉన్నమట్ల ఎలిజా ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ చింతలపూడి టిక్కెట్ కేటాయించింది. ప్రస్తుతం ఎంఎల్‌ఎగా ఉన్న ఆయనకు ప్రత్యేక కేడర్ సైతం ఉంది. అంతేకాకుండా చింతలపూడి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు సంప్రదాయ ఓటు బ్యాంకు సైతం కొంత ఉంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఈ నియోజకవర్గంలో 3,645 ఓట్లు వరకు వచ్చాయి. ఎంఎల్‌ఎగా ఎలిజాకు ఉన్న బలంతో పాటు కాంగ్రెస్ సంప్రదాయ ఓటింగ్‌తో ఈ నియోజక వర్గంలో గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. దీంతో వైసిపికి నష్టం చేకూరుతుందా, లేక టిడిపికి ఇబ్బంది వస్తుందా అనే చర్చ సాగుతోంది. ఇక నరసాపురం నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన వైసిపి క్షత్రియకు, జనసేన మత్స్యకార అభ్యర్థికి సీటు ఇచ్చాయి. ఈ నియోజకవర్గంలో కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉందని, అయితే ప్రధాన పార్టీలు కాపులకు సీటు ఇవ్వలేదనే చర్చ ఇప్పటికీ నడుస్తూనే ఉంది. ఈ తరుణంలో కాంగ్రెస్ కాపు సామాజిక తరగతికి చెందిన న్యాయవాది కానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్‌కు టిక్కెట్ ఇచ్చింది. దీంతో కాపు ఓట్లు కొంతమేర చీలే అవకాశం ఉందనే అంచనాలు వేస్తున్నారు. పోలవరం అభ్యర్థిగా ప్రకటించిన దువ్వల సృజన సైతం బలమైన అభ్యర్థిగా అంతా చెబుతున్నారు. ఈమె వైసిపి నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారు. ప్రజా సమస్యలపై గళమెత్తిన స్వభావం ఉంది. దీంతో ఈమె తక్కువగా లెక్కించినా 20 వేల ఓట్లు వరకూ చీల్చే అవకాశం ఉందని లెక్కలు కడుతున్నారు. ఉండి నియోజవకర్గం కాంగ్రెస్ టిక్కెట్ దక్కించుకున్న వేగేశ్న వెంకటగోపాలకృష్ణ సైతం ఎన్నికల బరిలో ప్రభావం చూపే అభ్యర్థిగా చెబుతున్నారు. ఈయన యూత్ కాంగ్రెస్ నాయకుడుగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ సాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటనతో అంతటా చర్చ మొదలైంది. కాంగ్రెస్ ఎవరి ఓట్లకు గండి కొడుతుందోనని లెక్కలు కడుతున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో టిక్కెట్ దక్కించుకున్న అభ్యర్థులు సైతం ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జిల్లాలో ఒక్కశాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశం కన్పిస్తోంది.

పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక ఓటింగ్ వచ్చే అవకాశం..?

ఇప్పటి వరకూ కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా ఐదు పార్లమెంట్ స్థానాలకు సంబంధించి మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. జిల్లాలోని ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. కేంద్రంలోని బిజెపిపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టుకు నిధులు వంటివే కాకుండా, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు పూనుకోవడం వంటి అనేక అంశాలపై బిజెపి వైఖరిపై జిల్లా ప్రజానీకంలోనూ తీవ్ర వ్యతిరేకత ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో ఈసారి ఎన్నికల బరిలోకి దిగాయి. దీంతో అసెంబ్లీ ఓటు టిడిపి కూటమి లేదా వైసిపిలో నచ్చిన అభ్యర్థికి వేసుకుని, ఎంపీ ఓటు మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికి వేయాలన్న చర్చ జనంలో నడుస్తోంది. లోకసభలో కాంగ్రెస్ ఓటుబ్యాంకు పెరిగితే బిజెపికి ఎదురుదెబ్బగా ఉంటుం దనే అభిప్రాయం చాలావందిలో వ్యక్తమవుతోంది. దీంతో అసెంబ్లీ స్థానాల్లో కంటే లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఎక్కువగా ఓట్లు వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది.

ఆలపాటి నరసింహమూర్తి
దెందులూరు

బొడ్డు నోబుల్
కైకలూరు

ఎ.సీతారాం
భీమవరం



ఉన్నమట్ల ఎలిజా
చింతలపూడి

పాతపాటి హరికుమార్‌రాజు
ఉంగుటూరు

కడలి రామారావు
తణుకు



వేగేశ్న గోపాలకృష్ణంరాజు
ఉండి

కొలుకులూరి అర్జునరావు
పాలకొల్లు

మార్నీడి శేఖర్ (బాబ్జి)
తాడేపల్లిగూడెం

దువ్వాడ సృజన
పోలవరం



మరీదు కృష్ణ
నూజివీడు

దళితుల శ్మశాన వాటికను ఆక్రమిస్తే సహించేది లేదు

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు

ఆక్రమణకు గురైన వెంప శ్మశాన వాటికను పరిశీలించిన కెవిపిఎస్ బృందం

నిరసన వ్యక్తం చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దళితులకు చెందిన శ్మశాన వాటికను ఆక్రమించాలని చూస్తే సహించేది లేదని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు హెచ్చరించారు. భీమవరం మండలం వెంపలో ఆధిపత్య కులాలకు చెందిన కొంతమంది వ్యక్తులు అక్రమంగా దళితులకు చెందిన శ్మశాన వాటికలో కంకర రోడ్డు వేసి ఆక్రమించడాన్ని నిరసిస్తూ మంగళవారం కెవిపిఎస్ బృందం ఆ ప్రాంతంలో పర్యటించి పరిశీలించింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ వెంపలో దళితులు తరతరాలుగా ఉపయోగించుకుంటున్న శ్మశాన వాటిక పలుమార్లు ఆక్రమణకు గురవుతుందన్నారు. గతంలో ఇదే శ్మశాన వాటికలో సమాధులను తొక్కుకుంటూ ఆక్వా చెరువుల కోసం కంకర రోడ్డు వేసుకున్నారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు దళితులు తమ శ్మశాన వాటికను కాపాడుకోవాల్సి వస్తుందన్నారు. రెండు రోజుల క్రితం కూడా అదే గ్రామానికి చెందిన ఆధిపత్య కులాలకు చెందిన వ్యక్తి అక్రమంగా ఆక్వా చెరువు కోసం పంట బోదెను సైతం పూడ్చి శ్మశాన వాటికలో కంకర గుట్టలు దించారని తెలిపారు. ఇదేమిటని దళితులు ప్రశ్నిస్తే మీకు దిక్కున్న చోట చెప్పుకోండని దౌర్జన్యంగా కంకర రోడ్డు వేశారని మండిపడ్డారు. ఆగ్రహించిన దళితులు ఆ కంకరను తొలగించి శ్మశాన వాటిక చుట్టూ సొంత సొమ్ముతో ఫెన్సింగ్ వేశారని తెలిపారు. అధికారులు న్యాయబద్ధంగా శ్మశాన వాటికను సర్వే చేసి దళితులకు చెందిన భూమిని దళితులకే చెందేలా చేయాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటిక చుట్టూ ప్రభుత్వాధికారులు తక్షణం ప్రహరీ నిర్మించాలని కోరారు. దళితుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని క్రాంతిబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, వెంప దళితపేట పెద్దలు, యూత్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకరించాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలుకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-324 ప్రకారం ఎన్నికల ప్రచారంలో అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి బ్యాంకుల నుండి సమాచారం పొందవచ్చని కలెక్టర్ అన్నారు. గత రెండు నెలల్లో రూ.95 వేలకు మించి డిపాజిట్ లేదా ఉపసంహరణకు సంబంధించి సరైన కారణం లేని లావాదేవీల సమాచారాన్ని అందజేయాలని కోరారు. నియోజకవర్గంలోని అనేక మంది వ్యక్తుల ఖాతాలకు ఒక బ్యాంకు ఖాతా నుండి ఆర్‌టిజిఎస్ ద్వారా ఎలాంటి పూర్వాపరాలు లేకుండా అసాధారణ బదిలీలకు సంబంధించిన వివరాలు కూడా అందజేయాలన్నారు. సిఇఒ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న విధంగా అభ్యర్థులు, జీవిత భాగస్వామి, అతనిపై ఆధారపడిన వారి బ్యాంక్ ఖాతా నుండి రూ.లక్ష విత్ డ్రా చేసిన వారి వివరాలను పొందుపరచాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీ రూ.లక్ష కంటే ఎక్కువ నగదు డిపాజిట్ వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, లీడ్‌బ్యాంకు మేనేజరు ఎ.నాగేంద్రప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహాశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

5న నరసాపురం, పాలకొల్లులో చంద్రబాబు పర్యటన

గోపాలపురం నుంచి నేరుగా హెలికాప్టర్‌లో నరసాపురం

ఆరో తేదీన అభ్యర్థులు, నేతలతో సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాగళం యాత్రలో భాగంగా ఈ నెల ఐదో తేదీ శుక్రవారం నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో పర్యటించను న్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై టిడిపి నాయకు లు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ నెల ఐదో తేదీ ఉద యం గోపాలపురంలో టిడిపి నాయకులతో సమావేశ అనంతరం హెలికాప్టర్‌లో నేరుగా నరసాపురం చేరుకుం టారు. స్థానిక జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ నుంచి పాలకొల్లు చేరుకుని స్థానిక జంక్షన్‌లో 15 నిముషాలు ప్రజలనుద్దేశించి మాట్లా డతారు. అనంతరం రాత్రికి పాలకొల్లులోనే బస చేస్తారు. ఆరో తేదీ ఉదయం పాలకొల్లులో టిడిపి నాయకు లతో సమావేశం నిర్వహించి అక్కడనుంచి నరసరావుపే బయల్దేరి వెళ్తారు.

దువ్వ యూనియన్ బ్యాంకులో భారీ స్కాం

డ్వాక్రా గ్రూపుల నుంచి సొమ్ము కాజేసిన సిఎ

ఆలస్యంగా వెలుగులోకి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలంలోని దువ్వ గ్రామంలో యూనియన్ బ్యాంకులో డ్వాక్రా పొదుపు సంఘాలకు చెందిన గ్రూపుల నుంచి డ్వాక్రా సిఎ సొమ్ము కాజేసిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. లబ్ధిదారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిఎ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలు సుమారు 45 గ్రూపులు ఉన్నాయన్నారు. గ్రూపునకు పది మంది మహిళల చొప్పున మొత్తం 450 మహిళలు లబ్ధిదారులుగా ఉన్నారు. కొంత కాలం నుంచి ఒక్కో గ్రూపు నుంచి తన వ్యక్తిగతంగా సొమ్ములు విత్ డ్రా చేస్తుందన్నారు. బ్యాంకు ఖాతా బుక్కుల్లో కొంత కాలంగా ప్రింటింగ్ వేయించకపోవడంతో ఇదే ఆసరాగా తీసుకుని సొమ్ములు విత్ డ్రాలు చేస్తుందన్నారు. లబ్ధిదారులు ఖాతా బుక్కుల్లో ఎందుకు ప్రింటింగ్ వేయించడంలేదని ప్రశ్నించడంతో అసలు విషయాలు బయటకొచ్చాయన్నారు. లబ్ధిదారులు బ్యాంకులను ఆశ్రయించడంతో అసలు విషయం తెలుసుకున్నామన్నారు. లబ్ధిదారులు సిఎ భాగ్యలక్ష్మి ఎదుట నిరసనకు దిగగా గ్రూపు సభ్యుల నుంచి తానే నగదు విత్‌డ్రా చేశానని ఒప్పుకుందని తెలిపారు. పెద్దల సమక్షంలో రాజీ ఒప్పంద పత్రం రాసి రెండు రోజుల్లో నగదు జమ చేస్తానని హామీ ఇచ్చిందని తెలిపారు. ఒక్కో ఖాతా నుంచి సుమారు రూ.2 లక్షల వరకు విత్ డ్రా చేసినట్లు ఆరోపిస్తున్నారు. భాగ్యలక్ష్మి కొంతకాలం వరకు ఆర్‌బికె సెంటర్‌లో పనిచేసిందని, అక్కడ కూడా ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆమెను విధుల నుంచి తప్పించారని లబ్ధిదారులు తెలిపారు. మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని లబ్ధిదారులతో మాట్లాడారు. డ్వాక్రా సిఎ భాగ్యలక్ష్మి అమాయక మహిళల ఖాతాల్లో సొమ్ములను డ్రా చేసిందన్నారు. సుమారు రూ.కోటి వరకు ఉంటుందని తెలిపారు. కలెక్టర్‌కి తెలియజేశామని, అక్కడ పీడీ, డిఆర్‌డిఎను, లీడ్ బ్యాంకు మేనేజర్‌ని రప్పించి గ్రామంలో ఉన్న అందరి ఖాతాలను పరిశీలించి అణాపైసాలతో సహా లెక్క తేల్చి, ఆమె ఆస్తులను సీజ్ చేపించి నష్టపోయినవారందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

టిడిపి మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ దువ్వ గ్రామంలో బ్యాంకు వద్దకు చేరుకుని బాధితులకు అండగా నిలిస్తానని చెప్పారు. ఆయన మాట్లాడుతూ దువ్వ గ్రామంలో భారీ స్కాం బయటపడిందని, డ్వాక్రా సంఘాల పేరుతో దాదాపు రూ.80 లక్షలు వసూలు చేసి అధికార పార్టీ నేతల అండదండలతో కుచ్చుటోపి పెట్టారన్నారు. మహిళల తరపున బ్యాంకు అధికారులతో మాట్లాడారు. సొమ్ములు దోచేసిన నిందితులను బయటకు తీసుకొస్తామని, దోచిన సొమ్ములను కట్టిస్తామని చెప్పారు. అప్పటి వరకు ఆందోళనలో ఉన్న మహిళలను వేధించవద్దని ఆరిమిల్లి బ్యాంకు అధికారులకు సూచించారు.

వాహన తనిఖీల్లో రూ.2.45 లక్షలు స్వాధీనం

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - గణపవరం

వాహన తని ఖీల్లో పోలీసులు రూ.2.45 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మండ లంలోని సరిపల్లి వద్ద గణపవరం ఎస్ఐ ఐవి.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కారులో వెళ్తున్న వారి వద్ద నుంచి రూ.2.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి బిల్లులు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

తల్లిదండ్రులు ఓటు వేసే బాధ్యత భవిష్య ఓటర్లదే

జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్

మానవహారంలో విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రలోభాలకు లోను కాకుండా తల్లిదండ్రులు ఓటు వేసే బాధ్యత భవిష్య ఓటర్లు తీసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జిసిహెచ్.ప్రభాకర్ అన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయురాలు జె.సుధారాణి అధ్యక్షతన భవిష్య ఓటర్ల అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులతో, బంధుమిత్రులతో ఓటు వేసే బాధ్యతను భవిష్య ఓటర్లు తీసుకోవాలన్నారు. భవిష్య ఓటర్ల ద్వారా అనేక విషయాలను వారి ఇంటికి చేర్చడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. అంతేకాకుండా వివిధ రకాలైన యాప్‌లు, ఓటర్లు హెల్ప్‌లైన్ యాప్ పనితీరును వివరించారు. ఈ యాప్‌ను విద్యార్థులు తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే వారికి ఓటింగ్‌కి సంబంధించిన అన్ని విషయాలు పొందుపరిచి ఉన్నాయన్నారు. ఈ యాప్ ద్వారా అవసరమైన వారు ఓటర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఈ అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. 2019 ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఓటింగ్ 82 శాతం ఉండగా దాన్ని 96 శాతానికి పెంచే విధంగా లక్ష్యం పెట్టుకున్నామన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి భవిష్య ఓటర్లు సహకరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో స్థానిక వీరమ్మ పార్కు వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ టీమ్ సభ్యులు చరణ్‌తేజ్, సప్ప శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటేసే సౌకర్యం

కలెక్టర్ సమిత్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

వయోవృద్ధులకు, విభిన్న ప్రతిభా వంతులకు వారి ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యాన్ని కల్పించాలని ఆయా రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో వయోవృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కు వినియోగంపై పలు సూచనలు జారీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వద్ద గుర్తింపు పొందిన నమోదైన రాజకీయ పార్టీల గుర్తులు కేటాయింపులు, నామినేషన్లు, పత్రాలు పరిశీలన, ఉపసంహరణలపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్న విభిన్న ప్రతిభావంతులకు సదరం ధ్రువీకరణ పత్రం ఆధారంగా, గర్భిణులు బ్లైండ్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి గుర్తించి ఫారం 12 దరఖాస్తును నమోదు చేసి, ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో అన్ని ధ్రువపత్రాలు సరిగా ఉన్నవా లేవా అని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అభ్యర్థులపై ఎటువంటి క్రిమినల్ కేసులు విషయంలో అఫిడవిట్‌లో పొందుపర్చారా లేదా అని క్షుణంగా పరిశీలించిన తర్వాత నామినేషన్ అమోదించడం, తిరస్కరించడం వంటి విషయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి సివి.ప్రవీణ్‌ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయాల వద్ద పెన్షన్ల పంపిణీ

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

నరసాపురం : ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా ప్రభుత్వం నిబంధ నల ప్రకారం సచివాలయం వద్దనే పెన్షన్ పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అందరూ బాధ్యత తీసుకుని నోడల్ ఆఫీసర్స్‌గా మున్సిపల్ సిబ్బంది సహకారంతో పెన్షన్ పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, శామియానా, కుర్చీలు, తాగునీరు, ఒఆర్‌ఎస్ పాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూ చించారు. లబ్ధిదారులకు ఈ సమాచారం మైకు ద్వారా, సెక్రటరీల ద్వారా తెలియ జేయాలన్నారు. ఇబ్బందులు లేకుండా మూడో తేదీ నుంచి పెన్షన్ సొమ్ము పంపిణీ చేసే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

25 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నత్తారామేశ్వరం, సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామాల సచివాలయ వాలంటీర్లు 25 మంది మంగళవారం రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్ష పార్టీలు తమపై చేస్తున్న విమర్శలకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నామని వారు తెలిపారు. తమ రాజీనామాల పత్రాలను ఆయా గ్రామ కార్యదర్శులకు అందించామని పేర్కొన్నారు.

పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వక్తలు

పాలకోడేరులో పాపన్న గౌడ్ వర్ధంతి

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు గౌడ్ సెంటర్ పురాణ దిమ్మ వద్ద తొలి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జువ్వలపాలెం మాజీ సర్పంచ్ కొండేటి శివకుమార్ బాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలో మొట్టమొదటి బహుజన చక్రవర్తి గోల్కొండ కోటను నవాబులు ఏలిన కాలంలో బాపన్న 12 మంది బహుజన సైన్యంతో బడుగు బలహీనులను చేరదీసి ఒక సైన్యంగా తయారు చేసి గోల్కొండ నవాబులు అరాచకాల మీద తిరుగుబాటు చేశారన్నారు. గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు అంగర సుబ్బారావు, యిర్రింకి శ్రీనివాస్, అధ్యక్షులు కారింకి సాయిబాబు, ఉపాధ్యక్షులు చిటికెన పుల్లయ్య, కార్యదర్శి బెజవాడ సుబ్బారావు, పాపన్న గౌడ్ విగ్రహ దాత మన్యం తేజగౌడ్, సంఘ గౌరవ సలహా కమిటీ సభ్యులు అత్తిలి వెంకటేశ్వరరావు, రామకృష్ణ, చిటికెన రమేష్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

'అభివృద్ధిని గాలికొదిలేసిన వైసిపి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గణేష్ నగర్ నుంచి వాకర్స్ గ్రౌండ్ మీదుగా కొండ్రుపోలు వెళ్లే రోడ్డును తాము అధికారంలోకొచ్చిన ఆరు నెలల లోపే నిర్మిస్తామని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం వాకర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు బొలిశెట్టిని శాలువా, పూల దండలతో సత్కారం చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అభివృద్ధి గాలికొదిలి ప్రజలను దోచుకున్నారన్నారు. ఒక రూపాయి ఎర చూపి పది రూపాయలు పన్నుల రూపంలో నిత్యావసర సరుకుల రూపంలో దోచిన జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అన్ని వర్గాల వారు సిద్ధంగా ఉన్నారన్నారు. నిన్నటిదాకా సిద్ధం అంటూ కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన జగన్, మేమంతా సిద్ధం బస్సు యాత్ర పేరుతో ప్రజలను మరోసారి ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని అంజుమన్ బిల్డింగ్‌లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అంజుమన్ అధ్యక్షులు, కార్యదర్శులు షేక్ బుల్లి మస్తాన్, ఎండి దావూద్ ఖాన్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి మౌలాలిఖాన్, బడేవలి అయ్యుబ ఖాన్, ఖాజా అమాన్, అహ్మద్ పాషీ, జప్ఫార్, ఆషిప్ పాల్గొన్నారు.

యడ్లబజారులో గుడాల గోపీ ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 11వ వార్డ్ యడ్లబజారు సెంటర్ నుంచి వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ సతీమణి గుడాల మంగతయారు, తనయుడు గుడాల సాయిబాలాజీ మంగళవారం ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుడాల గోపీ మాట్లాడుతూ పాలకొల్లు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పరు.

రాజకీయాల్లో ఊసరవెల్లి అంజిబాబు

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాజకీయాల్లో ఊసరవెల్లి జనసేన అభ్యర్థి పులపర్తి అంజిబాబు అని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని మంగళవారం సాయంత్రం గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్త పూసలమర్రు, దొంగ పిండి గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అభ్యర్థి పులపర్తి అంజిబాబు ఇప్పటికే కాంగ్రెస్, టిడిపి కండువాలను మార్చుకుని జనసేన కండువా కప్పుకుని రాజకీయాల్లో ఊసరవెల్లిగా మారారని విమర్శించారు.

'ఎన్నికల కోడ్‌ను అపహాస్యం చేస్తున్న వైసిపి'

ప్రజాశక్తి - పోడూరు

మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు పలు ప్రధాన శాఖలకు కేటాయించాల్సిన నిధులను సిఎం జగన్ తన కాంట్రాక్టర్లకు చెల్లించాడని, ఎన్నికల కోడ్‌ను జగన్ అపహాస్యం చేస్తున్నాడని మాజీ మంత్రి, టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొమ్ముచిక్కాలని తన స్వగృహంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కుపై నమ్మకాన్ని కోల్పోతున్న సమయంలో నిమ్మగడ్డ ప్రసాద్ వాలంటీర్లపై వేసిన పిటీషన్‌ను వైసిపి నాయకులు విమర్శిస్తున్నారన్నారు. ఎలక్షన్ కమిషన్ వాలంటీర్లపై చర్యలు తీసుకుంటే టిడిపి, జనసేన నాయకులపై అభాండాలు వేస్తున్నరన్నారు. గ్రామ వాలంటీర్లతో వైసిపి నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారన్నారు. పెన్షన్లు ప్రభుత్వ ఉద్యోగులతో ఇప్పించేలా జిఒ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేవన్నారు. ఆర్‌బిఐ దగ్గర రూ.4000 కోట్లకు బాండ్లను సిఎం జగన్ మోహన్‌రెడ్డి అమ్ముకున్నాడన్నారు.

'టిడిపి కూటమికి ఓటమి భయం'

ప్రజాశక్తి - ఆచంట

టిడిపి కూటమికి ఓటమి భయం ఎన్నికల ముందే ప్రారంభమైందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆచంట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆయన మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి సిఎం జగన్ మంచి చేశారన్నారు. వాలంటీరు వ్యవస్థతో పేదలకు పారదర్శకంగా సంక్షేమం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సారవ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కైలా సత్యనారాయణ వారి అనుచరులు జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ నాయకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, వాతాడి కనకరాజు, వెన్న నరేష్, కంచర్ల ఫణి పాల్గొన్నారు. మండలంలోని రుస్తుంబాద గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ బొమ్మిడి నాయకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆటో యూనియన్ ఆత్మీయ సమావేశంలో పలువురు ఆటో డ్రైవర్లు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ వారికి పార్టీ కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు.

మొగల్తూరు : వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లిలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వారందరికీ ముదునూరి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వజ్రాల కన్నా పుస్తకాల విలువే ఎక్కువ

అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంలో ప్రముఖ తెలుగు పండితులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మంచి పుస్తకం ఓ మంచి ప్రాణ స్నేహితుడితో సమానమని, వజ్రాల కన్నా పుస్తకాల విలువే ఎక్కువని, మాతృభాషను రక్షించుకోవడానికి పిల్లలకు పుస్తకాలను దగ్గర చేయడం ఓ మంచి మార్గమని ప్రముఖ తెలుగు పండితులు, ఉపాధ్యాయులు చిర్రావూరి సుబ్రహ్మణ్యం అన్నారు. మహాత్మగాంధీ మెమోరియల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇవ్వగలిగిన అమూల్యమైన ఆస్తి మంచి పుస్తకాలేనని, చదువు మెదడుకు పదును పెడుతుందని, పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయించడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. కథల పుస్తకాలు పిల్లల్లో ఏకాగ్రత, సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. పాఠశాల హెచ్‌ఎం షేక్ బాబాజీ సాహెబ్ మాట్లాడుతూ చూడటం కన్నా చదవడం వల్ల మంచి అనుభూతిని పొందుతారన్నారు. పెద్దలు నిత్యం కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయిస్తూ పిల్లలకు అలవాటు మార్చాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పుస్తకరూపం మారవచ్చు కాని, పుస్తకానికి ఆదరణ మాత్రం తగ్గలేదని, తరతరాలుగా జ్ఞానాన్ని వారసత్వంగా అందిస్తున్నది పుస్తకమేనని, ఇంటర్నెట్‌లో చదివే పిల్లల్లో సహజ ఎదుగుదల మందగిస్తుందని, పుస్తక పఠనాన్ని తల్లిదండ్రులు, పెద్దలు బాధ్యతగా స్వీకరించి పిల్లలకి చిన్నప్పటి నుండే చదివించాలన్నారు. ఆ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోడూరు : పిల్లలు బాల్యం నుంచి పుస్తకాలను చదివేలా ప్రోత్సహించాలని ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. మండలంలోని చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్ అధ్యక్షతన మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్ స్వచ్ఛంద సంస్థ ప్రపంచవ్యాప్తంగా పిల్లలను అమితంగా ఆకర్షించిన ది లిటిల్ మర్మెయిడ్, ది అగ్లీ డక్లింగ్ బాల సాహిత్య పుస్తకాల రచయిత డెన్మార్క్ దేశానికి చెందిన హాన్స్ క్రిస్టియన్ ఆండర్సన్ గౌరవార్థం 1967 నుంచి ఆయన పుట్టినరోజైన ఏప్రిల్ రెండో తేదీని అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల్లోను, మ్యాగజైన్లలోను ప్రచురితమైన పిల్లల్లో పఠనాభిలాషను, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు సహకరించే పజిల్స్, బాలల కథలు, క్లిప్పింగ్‌లతో తయారు చేసిన 30 ఆల్బమ్‌లను సూర్యకుమార్ పాఠశాలలో ప్రదర్శించారు.

పోడూరులో...

వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి

జిల్లా ఉప పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ

ప్రజాశక్తి - మొగల్తూరు

వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఉప పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజుతో కలిసి తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముత్యాలపల్లి గ్రామంలో పర్యటించరు. తాగునీటి సరఫరాలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పూర్తిస్థాయిలో మంచినీటి ప్రాజెక్టు చెరువులు నింపాలన్నారు. శుద్ధి చేసిన నీరు సరఫరాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కోమటితిప్పలో బృహత్తర మంచినీటి ప్రాజెక్టు చెరువును వారు పరిశీలించారు. వారితో పాటు ఇఒపిఆర్‌డి నవీన్‌కిరణ్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ మోహనరావు, పంచాయతీ కార్యదర్శి సీతారామారావు ఉన్నారు.

పోడూరు : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ డి.సుహాసిని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని పెనుమదం, గుమ్ములూరు గ్రామాల్లో మంచినీటి ప్రాజెక్టులను ఆమె మంగళవారం పరిశీలించారు. మంచినీటి చెరువులను, ఫిల్టర్‌బెడ్లను, ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. పెనుమదం ప్రాజెక్టు నుంచి రావిపాడు గ్రామానికి కొత్త పైపులైన్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో తాగునీటి పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా మంచినీటి పైపులైన్లు, పంపు హౌస్‌ల్లో మోటార్లు సక్రమంగా ఉండేలా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎంపిడిఒ సుహాసిని, ఇఒపిఆర్‌డి ఎం.బలరామరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బుజ్జేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

మొగల్తూరు : చెరువులను పరిశీలిస్తున్న సత్యనారాయణ

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్న వస్తువులను, నగదు రవాణా అరికట్టేందుకు వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం లీడర్ మోరంపూడి శాంతి మౌనిక, ఎఎస్ఐ యు.రాజేంద్ర, సిబ్బంది ఉన్నారు.

శృంగవృక్షం వాలంటీర్‌పై కేసు

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం గ్రామానికి చెందిన వాలంటీర్‌పై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ నాలం శ్రీనివాసరావు తెలిపారు. గ్రామానికి చెందిన వాలంటీర్ జంగం అఖిల్ ప్రభుత్వ అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించి వాలంటీర్ వాట్సాప్ గ్రూపులో ఒక పోస్ట్ పెట్టినట్లు చెప్పారు. ఈ ఘటనపై పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి దొంగ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సంబంధిత వాలంటీర్ అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'వైసిపిని ఆదరించండి'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు సతీమణి శారదవాణి ప్రజలను కోరారు. మండలంలోని కాళీపట్నం పడమర, పాతపాడు గ్రామాల్లో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని ప్రతిఇంటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణ, మాజీ సర్పంచి ఉమామహేశ్వరరావు, కవురు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉండిలో శివరామరాజు ప్రచారం

ఉండి :నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా ఆదరించండి అంటూ ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు ఆటోలో మంగళవారం ప్రచారం చేశారు. మండలంలోని చిలుకూరు, వెలివర్రు, పాములపర్రు, కోలమూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కోలమూరులో పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివ రాజు, మోపిదేవి శ్రీనివాసరావు, నడింపల్లి వెంకటరాజు, బురిడి రవిబాబు, దవిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిపై అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

షుగర్ వ్యాధిపై అశ్రద్ధ వహించొద్దని జోన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వంగపండు రామ్మోహనరావు ఆధ్వర్యంలో లయన్ మారిశెట్టి సత్యనారాయణ రాజు ఆర్థిక సహకారంతో కడకట్లలో జనతా ఛారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరాన్ని పేరిచర్ల మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుని ప్రతిరోజు తగిన వ్యాయామం చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సభ్యులు చేస్తున్న మంచి కార్యక్రమాలను అభినందించారు. ఈ శిబిరంలో మొత్తం 108 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సెక్రటరీ చిన్నం జగదీష్, నాగేశ్వరరావు, దాట్ల లక్ష్మీపతిరాజు, సుంకర శ్రీనివాసరావు, పడాల మహేశ్వరరావు, మహాలక్ష్మి, వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

అందరూ ఐక్యతతో మెలగాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజంలో ప్రతిఒక్కరూ ఐక్యతతో కలిసి పని చేసుకుంటూ ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మెంటేవారితోటలో సుమారు రూ.20 లక్షలతో నాయీ బ్రాహ్మణులు నిర్మించుకున్న కమ్యూనిటీ హాలును ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ కలిసి ఐక్యతతో పనిచేసి ప్రతిఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మల్లువలస రఘుబాబు, ఉపాధ్యక్షులు మల్లు వలస మావుళ్ళయ్య, వ్యాపాడి పెద్దిరాజు, తురువాల దుర్గాప్రసాద్, గూడవలస ఏసు, తుంపాల నరేష్ కుమార్, సారిక దుర్గారావు, తుంపాల వెంకటేశ్వరరావు, మల్లువలస రాము, లబ్బీ శ్రీనివాస్, తుంపాల శ్రీనివాస్, మల్లు వలస పెద్దిరాజు పాల్గొన్నారు.

ముత్యాలపల్లి అభివృద్ధి ఘనత వైసిపిదే

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గ్రామంలో ఆయన పల్లెనిద్ర చేశారు. మంగళవారం మార్నింగ్ వాకింగ్‌లో గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ మేనిఫెస్టోను, అమలు చేసిన సంక్షేమ పథకాలను వారికి వివరించారు. రానున్న ఎన్నికల్లో తమను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, నాయకులు రేవు రాంబాబు, తిరుమాని పెద్దిరాజు, సత్యనారాయణ, రేవు నారాయణమూర్తి, సాధనాల నాగరాజు, రాము, బండి ముత్యాలమ్మ, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఓసూరి విజ్జిబాబు, కడలి నాగార్జున, దొంగ యుగంధర్, కొల్లాటి రామారావు, కాకిలేటి ఆనంద్ కుమార్, చినిమిల్లి చందు, అయితం యుగంధర్, కటికల సూర్యారావు, అడ్డాల శివన్నారాయణ, పడవల సత్యనారాయణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్

నరసాపురం : నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తానని జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని చామకూరిపాలెం, మోడీ గ్రామాల్లో టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు (రామరాజు), జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్న)లతో కలిసి నాయకర్ ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, ఘంటా కృష్ణ పాల్గొన్నారు.

పెన్షన్లు ఇంటి వద్దే అందించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి ప్రభుత్వం నిలిపేసిన సామాజిక పెన్షన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దే అందించాలని టిడిపి నేతలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఖజానా ఖాళీ అయినప్పటికీ ప్రతిపక్షాలు పెన్షన్లు ఇవ్వొద్దని ఆటంకాలు సృష్టించాయని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. పెన్షన్లు వాలంటీర్ల ద్వారా కాకుండా మిగిలిన ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా వృద్ధులకు, వికలాంగులకు, ఇతర పెన్షన్ దారులకు ఇంటికివెళ్లి అందించాలని డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ పెన్షన్ సకాలంలో అందించి న్యాయం చేయాలన్నారు. అబద్ధపు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి డ్వాక్రా అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరని నారాయణమ్మ, భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, భీమవరం మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృధ్వీశంకర్, టిడిపి నాయకులు మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసిమబేగం, ఎండి షబీనా, బి.పద్మ, గంధం రాధ, ఎద్దు ఏసుపాదం, మెంటే గోపీ, మైలాబత్తుల ఐజాక్ బాబు, చల్లబోయిన సుబ్బారావు, గంటా త్రిమూర్తులు, బొక్క సూరిబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : వైసిపి ప్రభుత్వం ఏప్రిల్ నెల పెన్షన్‌ను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలని టిడిపి మండలాధ్యక్షుడు కోడి విజయభాస్కర్ కోరారు. ఈ మేరకు ఆయన ఎంపిడిఒ అనుపమకు వినతిపత్రం మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ ఖజానాలో నిధులు లేనందువల్లే పెన్షన్ సొమ్మును పంపిణీ చేయలేదన్నారు. నిధులుంటే ఏప్రిల్ ఒకటో తేదీన ఇళ్ల వద్దనే పంపిణీకి జగన్ ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదని ప్రశ్నించారు. పెన్షన్ సొమ్ము పంపిణీ ఆగిపోవడానికి ఎన్నికల కమిషన్, టిడిపి కారణం కాదన్నారు. సిఎం జగన్ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పెన్షన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టాడన్నారు. ఈ కార్యక్రమంలో పాముల రజనికుమార్, రాయి ప్రసాద్, సాగ సత్యనారాయణ, నెక్కింటి ఆదినారాయణ, అంగర వీరభద్రకుమార్, దొడ్డ శ్రీనివాస్, వెగేశన్న శ్రీహరిరాజు, రాపాక విజయరత్నం, చాంద్ రాజు, గుబ్బల ప్రసాద్ పాల్గొన్నారు.

పోడూరు : వైసిపి ప్రభుత్వ ఖజానాలో నిధులు లేనందు వల్లే పెన్షన్ సొమ్మును పంపిణీ చేయలేదని టిడిపి మండలాధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్‌కి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ నిధులుంటే ఏప్రిల్ ఒకటో తేదీన ఇళ్ల వద్దనే పెన్షన్ పంపిణీ చేయాలని జగన్ ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదని ప్రశ్నించారు. పెన్షన్ సొమ్ము ఇళ్ల వద్ద పంపిణీ చేయకపోవడానికి ఎన్నికల కమిషన్, టిడిపి కారణం కాదన్నారు. సిఎం జగన్ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పెన్షన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టాడన్నారు. పెన్షన్ సొమ్మును సకాలంలో పంపిణీ చేయకపోతే ప్రభుత్వ సిఇఒ జవహర్‌రెడ్డి సెర్ప్ సిఇఒ మురళీధర్ రెడ్డి, సిఎం జగన్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మేడపాటి గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

భీమవరం : కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఎస్‌సి సెల్ మండలాధ్యక్షునిగా రాంబాబు

ప్రజాశక్తి ఆచంట

ఎస్‌సి సెల్ ఆచంట మండలాధ్యక్షునిగా కొడమంచిలి అరుంధతిపేటకు చెందిన ఆకుమర్తి రాంబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తనను నియమించిన ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతలను నమ్మకంగా నిర్వర్తించి పార్టీ గెలుపులో ప్రముఖ పాత్ర వహిస్తానని తెలిపారు. కష్టపడి పనిచేస్తే పదవులు అవే వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఉప సర్పంచి ములగాడ వరప్రసాద్, వైసిపి ఆచంట మండల మహిళ విభాగం అధ్యక్షులు కొండేటి లక్ష్మి, సచివాలయం కన్వీనర్లు కొండేటి వరప్రసాద్, గున్నాబత్తుల వెంకటాచారి, వైసిపి నాయకులు చదలవాడ రాజేష్, పల్లేరు రమేష్, కొండేటి నాగరాజు, రొక్కల రాజ్‌కుమార్, పొలిశెట్టి వనమారాజు పాల్గొన్నారు.

సమిష్టిగా పనిచేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎన్నికలకు ఎంతో సమయం లేదని, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. మాజీ కౌన్సిలర్ గురుజు సూరిబాబు నివాసం వద్ద మూడు పార్టీల ముఖ్య నాయకులతో మంగళవారం ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జి, ఈతకోట తాతాజి మాట్లాడుతూ పట్టణంలో మూడు పార్టీల పట్టణ అధ్యక్షులు సమిష్టిగా ఓటర్ల జాబితాను సమీక్షించి వారి దగ్గరకు కూటమి ఏ జెండాలను తీసుకెళ్తామని తెలిపారు. గ్రామాలు, వార్డుల వారీగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ఓటర్ల దగ్గరకు వెళ్లి టిడిపి కూటమి అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో వివరించాలని సూచించారు.

పాలమూరులో శ్రీరంగనాథరాజు ప్రచారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని ఆ పార్టీ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. మండలంలోని పొలమూరులో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
I.A.No. 185/2023 IN O.S. No. 13/2023
Between :
1) GAADI GNANA SREE
2) GAADI NAGA MANIKANTA
(Being minors represented by Guardian Father / Gadi Anil Kumar)
... Petitioners/ Plaintiffs
AND
BODDU SUDHARSANA & Others
... Respondents/ Defendants
టు,
4వ రెస్పాండెంట్/ ప్రతివాది: కొప్పాడ మహేష్, S/o : కె.టి.ఎస్.వి.ప్రసాద్, C/o పి.సురేష్, డోర్ నెం. 13-16-44, Proprollu vari, గున్నిపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు దావాలో 4వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది. 16-4-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరుపబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 16-4-2024
వి.వి.వరదరాజులు
న్యాయవాది
మచిలీపట్నం.
మచిలీపట్నం,
ది.29-3-2024

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
O.S. No. 13/2023
Between :
1) GAADI GNANA SREE
2) GAADI NAGA MANIKANTA
(Being minors represented by Guardian Father / Gadi Anil Kumar) ... Plaintiffs
AND
BODDU SUDHARSANA & Others
... Defendants
టు,
4వ ప్రతివాది అడ్రస్ : కొప్పాడ మహేష్, S/o : కె.టి.ఎస్.వి.ప్రసాద్, C/o పి.సురేష్, డోర్ నెం. 13-16-44, Proprollu vari, గున్నిపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది. 16-4-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరుపబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 16-4-2024
వి.వి.వరదరాజులు
న్యాయవాది
మచిలీపట్నం.
మచిలీపట్నం,
ది.29-3-2024

మహారాజశ్రీ మొదటి అదనపు జిల్లా కోర్టు, ఏలూరు, ప॥గో॥జిల్లా
M.V.O.P. 43/2020
బిట్వీన్:
కె.యశ్వంత రాయలు -పిటీషనరు
ఎ.శేషగిరిరావు & 5 అదర్స్
-రెస్పాండెంట్లు
R-3: అడబాల దుర్గా భూలక్ష్మి
W/o. లేటు శేషగిరిరావు.
R-4: ఎ.రాజు, S/o. శేషగిరిరావు.
R-5: ఎ.స్వామినాయుడు, S/o. శేషగిరిరావు.
R-6: ఎ.బేబి ధనలక్ష్మి, D/o. శేషగిరిరావు.
R/o. D.No. 8-104/ఎ, మత్స్యపురి రోడ్డు, వీరవాసరం (V & M), ప॥గో॥జిల్లా.
పై ఉదహరించిన రెస్పాండెంట్లు 3 to 6 నోటీసు నిమిత్తం ది. 15-4-2024న ఉదయం 10.30 ని॥లకు ఆక్షేపణలున్నచో శ్రీ కోర్టు వారి యందు తెలుపుకోని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
జగ్గవరపు సురేష్‌కుమార్‌రెడ్డి
అడ్వకేటు, ఏలూరు
సెల్: 9441606789
ఏలూరు
30-3-2024